بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 29.11.2019 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప అభిమాని అయిన అనుచరుల సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 29.11.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. బద్రి అనుచరులైన హజ్రత్ యజీద్ బిన్ సాబిత్ అన్సార్ తెగ ఖజ్రజ్ వంశము బనూ మాలిక్ బిన్ నజ్జార్‌కు చెందినవారు. వీరు హజ్రత్ జైద్ బిన్ సాబిత్ పెద్ద సోదరులు. హజ్రత్ యజీద్ బిన్ సాబిత్ బదర్, ఉహద్ రెండు యుద్ధములలో పాల్గొనిరి. వీరు హిజ్రి 12వ సం॥లో హజ్రత్ అబూబకర్ ఖిలాఫత్ హయాంలో సంభవించిన యమామ యుద్ధములో అమరులైరి.

హజ్రత్ యజీద్ బిన్ సాబిత్ ఇట్లు ఉల్లేఖించిరి. ఒకసారి అనుచరులతో కలిసి వారు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద కూర్చొని వుండిరి. అప్పుడొక జనాజ (పార్థివ దేహం) అక్కడి నుండి వెళ్ళుచుండెను. దానిని చూడగానే తక్షణమే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిలబడిరి. కావున వారి అనుచరులు కూడ వేగంగా నిలబడిరి. జనాజ వెళ్ళి పోయేంత వరకు వారు నిలబడిరి. హజ్రత్ యజీద్ ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! నా దృష్టిలో వారు ఏదో ఒక ఇబ్బంది వలన లేక స్థలము సరిపోనందుకు నిలబడలేదు. నాకు తెలిసినంత వరకు అది ఒక యహూది పురుషుని లేదా స్త్రీ జనాజ అయి వుండెను.

హజ్రత్ యజీద్ బిన్ సాబిత్ మరో కథనములో ఇట్లు ఉల్లేఖించిరి. మేము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి బయలు దేరితిమి. వారొక క్రొత్త సమాధిని చూసి ఇదేమిటి? అని అడిగిరి. ఇది ఫలానా తెగలోని బానిస స్త్రీ సమాధి అని ప్రజలు సమాధానమిచ్చిరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెను గుర్తు పట్టిరి. ఆమె మధ్యాహ్నము మృతి చెందెను. అప్పుడు మీరు విశ్రాంతి తీసుకుంటుండిరి, మీ విశ్రాంతికి భంగము కలుగకూడదని మేము మిమ్ములను సంప్రదించలేదని ప్రజలు తెలిపిరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిలబడి, తమ వెనుక వరుసగా అనుచరులను నిలబెట్టించిరి. ఆమె కొరకు నాలుగు తక్బీర్లు చెప్పిరి. అనగా సమాధి వద్దనే వరుసలు నెలబెట్టించి జనాజ ప్రార్థన చదివించిరి. నేను మీలో వున్నంత వరకు ఎవరైనా మృతి చెందినచో నాకు తప్పక సమాచారమందించండి. ఎందుకనగా నా దుఆ వలన అతడు కరుణించబడునని వారు సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి.

మరో అనుచరుని పేరు హజ్రత్ మవూజ్ బిన్ అమర్ బిన్ జమూహ్. హజ్రత్ మవూజ్ అన్సార్ తెగ ఖజ్రజ్‌లోని బనూహాషిమ్ వంశమునకు చెందినవారు. హజ్రత్ మవూజ్ తండ్రి పేరు అమర్ బిన్ జమూహ్ కాగా తల్లి పేరు హింద్ బిన్తె అమర్. హజ్రత్ మవూజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ తన ఇద్దరు సోదరులు హజ్రత్ మఆజ్, హజ్రత్ ఖల్లాద్‌తో కలిసి బదర్ యుద్ధములో పాల్గొనిరి. అనంతరం ఉహద్ యుద్ధములో కూడ పాల్గొనిరి. హజ్రత్ మవూజ్ బిన్ అమర్ తండ్రి అమర్ బిన్ జమూహ్ ఎవరనగా ఇంతకు ముందు ప్రస్తావించినట్లు వీరి కుంటితనం వలన వీరి కుమారులు వీరిని బదర్ యుద్ధములో పాల్గొననివ్వలేదు. ఉహద్ సందర్భము వచ్చినప్పుడు హజ్రత్ అమర్ బిన్ జమూహ్ తమ కుమారులతో ఇట్లనిరి. బదర్ సమయమున మీరు నన్ను పోనివ్వలేదు. కాని ఇప్పుడు నేను తప్పక పాల్గొంటాను. మీరు నన్ను నిలువరించలేరు. మీ కాలు మంచిగా లేనందున యుద్ధము మీపై విధించబడలేదని కుమారులు చెప్పిరి. అప్పుడు అమర్ బిన్ జమూహ్ ఒప్పుకోక నేరుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్తా! నా కాలు నొప్పి వలన నా కుమారులు నన్ను యుద్ధములో పాల్గొనివ్వడం లేదు. కాని నేను మీతో కలిసి యుద్ధములో పాల్గొనదలచినాను. బదులుగా రసూలుల్లాహ్

సల్లల్లాహు అలైహి వసల్లం కూడ నీ కాలు నొప్పి వలన యుద్ధము నీకు తప్పనిసరి కాదనిరి. కాని వారు (సల్లం) వారి ఉత్తేజము, ఆసక్తిని గమచనించి అనుమతించిరి. హ్రజత్ అమర్ బిన్ జమూహ్ తన యుద్ధ ఆయుధములు ధరించి అల్లాహ్ తఆలా నాకు అమరత్వము ప్రసాదించుగాక!, నన్ను విఫలము చేసి నా కుటుంబ సభ్యుల వద్దకు తిరిగి పంపకూడదని దుఆ చేస్తూ బయలు దేరిరి. అనంతరం వారి కోరిక అలాగే పూర్తి అయినది. వారు ఉహద్ మైదానములో అమరులైరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఎవరి హస్తములో నా ప్రాణమున్నదో ఆ అల్లాహ్ ప్రమాణముగా! తన కుంటితనముతో స్వర్గములో నడుస్తున్నట్లు నేను అమర్ బిన్ జమూహ్‌ను చూచినాను.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హ్రజత్ బిషర్ బిన్ బరా బిన్ మ'రూర్. హ్రజత్ బిషర్ అన్సార్ తెగ ఖ్రజ్‌లోని బనూ ఉబైద్ బిన్ అదీ వంశమునకు చెందినవారు. మరో కథనము ప్రకారము బనూ సల్మాకు చెందినవారు. హ్రజత్ బిషర్ తండ్రి పేరు హ్రజత్ బరా బిన్ మ'రూర్ కాగా తల్లి పేరు ఖలీదహ్ బిన్తె ఖైస్. హ్రజత్ బిషర్ తండ్రి హ్రజత్ బరా బిన్ మ'రూర్ పన్నెండుగురు నఖీబ్ (పర్యవేక్షకు)లలో ఒకరు. వారు బనూ సల్మా తెగకు నఖీబ్‌గా వుండిరి. హ్రజత్ బిషర్ తమ తండ్రితో కలిసి బైఅతె అఖ్బా సానియా (ద్వితీయ)లో పాల్గొనిరి. హ్రజత్ బిషర్ బిన్ బరా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిపుణులైన విల్లుకారులలో ఒకరు. హ్రజత్ బిషర్ బదర్, ఉహద్, ఖందక్, ఖైబర్ యుద్ధములలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరని అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ ఉల్లేఖించిరి. ఓ బనూ సల్మా మీ నాయకుడెవరు? జద్ద్ బిన్ ఖైస్ అని వారు బదులిచ్చిరి. వారిట్లడిగిరి. అతనిని ఏ కారణము వలన నాయకుడని నమ్ముతారు? అతడు మాలో అత్యంత ధనవంతుడు. కాని అతడు చాలా లోభికుడు. ఈ విషయము మాకిష్టము లేదని అనుచరులు బదులిచ్చిరి. లోభికుడగుట చాలా పెద్ద వ్యాధి. ఇందు వలన అతడు మీ నాయకుడగుటకు అర్హుడు కాదని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. అటులైనచో ఓ దైవ ప్రవక్తా! మా నాయకుడెవరో మీరే చెప్పండి. అని వారు వేడుకొనిరి. వారు బిషర్ బిన్ బరా బిన్ మ'రూర్ అని బదులిచ్చిరి. అనగా ఇప్పుడు ప్రస్తావించబడతున్న అనుచరుని గురించి ఇతడే మీ నాయకుడని అనిరి.

హ్రజత్ ఇబ్నె అబ్బాస్ ఇట్లనిరి. ఔస్, ఖ్రజ్‌నకు విరుద్ధముగా విజయము లభించాలని యూదులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరణ కంటే ముందు ప్రార్థన చేసేవారు. అనగా వీరు పరస్పరం వాదులాడుకునేవారు. కావున అవతరించబోవు ప్రవక్త పేరున మాకు విజయము నొసంగుమని దుఆ చేసేవారు. కాని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించిన తర్వాత వారే తిరస్కరించిరి. వారు చెప్పిన విషయమునే వారు నిరాకరించిరి. హ్రజత్ మఆజ్ బిన్ జబల్, హ్రజత్ బిషర్ బిన్ బరా, దావూద్ బిన్ సల్మా ఒక రోజు వారితో ఇట్లనిరి. ఓ యూదుల వర్గీయులారా! అల్లాహ్‌తో భయపడుతు ఇస్లాంను స్వీకరించుము. ఇంతకు ముందు మీరే ముహమ్మద్ నామమున అవతరించే ప్రవక్త పేరున విజయము కోరుకునేవారు. ఇప్పుడా ప్రవక్త అవతరించినను మీరెందుకు విశ్వసించడం లేదు. బదులుగా బనూ నజీర్ నాయకుడు, కోశాధికారి, ఖైబర్ యుద్ధములో ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విషమిచ్చిన స్త్రీ భర్త అయిన సలాం బిన్ ముష్కమ్ అను యూదుడు ఇట్లనెను. మేము గర్తించే సంకేతములతో వారు మా కొరకు అవతరించలేదు. మేము మీతో ప్రస్తావించిన ప్రవక్త వారు కాదు.

హ్రజత్ కాబ్ బిన్ అమర్ అన్సారి ఇట్లు ఉల్లేఖించిరి. ఉహద్ యుద్ధము రోజున తమ జాతికి చెందిన 14 మందిని తీసుకొని మేము ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద వుండగా మాకు కునుకు వచ్చెను. అది శాంతినిచ్చినది. అనగా ఆ కునుకు చాలా సుఖాన్నిచ్చెను. యుద్ధ వాతావరణమైనను మాకు తృప్తినిచ్చెను. ప్రతి ఒక్కరి నోటి నుండి గాఢ నిద్రకు సూచికకగా గురుక కొడుతున్నట్లు చప్పుడు వస్తుండెను. హ్రజత్ ఖలీఫతుల్ మసీహ్రాబె దీని విశ్లేషణ ఇట్లు చేసిరి. '**అమనతన్నుఆసా**' విభిన్న కోణములలో అనువదించబడును. దీని సారాంశమేమనగా బాధ దుఃఖము తర్వాత మీ కొరకు నిద్ర రూపంలో సుఖము అవతరించబడెను. లేదా నిద్రతో పోల్చి వున్న లేదా నిద్ర లాంటి ప్రభావము కలిగించు శాంతి మీకు నొసంగబడెను. నిద్ర వలె నుండు శాంతియుత స్థితిని మీకు నొసంగితిమని అల్లాహ్ తఆలా తెలిపెను. కాని అది మీరు తమ అవయవములపై పట్టు కోల్పోయేంత గాఢ నిద్ర కాదు. అది మీకు శాంతిని కలిగిస్తున్నను మిమ్ములను పనికిరాకుండా చేయలేదు.

హ్రజత్ ఖలీఫా రాబె ఇట్లు వ్రాసిరి. హ్రజత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వున్న అనుచరులందరిపై అకస్మాత్తుగా ఆకాశము నుండి ఏదో ఒకటి అవతరించి, వారందరిని ఆవహించెను. అనగా యుద్ధము జరుగుచుండగా, శత్రువు నుండి తీవ్ర ప్రమాదమున్ననూ అందరికందరు ఒకే సారి నిద్రలోకి జారుకొనిరి. ఇదొక మహిమ. ఇదేదో అనుకోకుండా జరిగిన సంఘటన కాదు. అల్లాహ్ తఆలా వరపున వారికి అప్పుడు శాంతినిచ్చు ఒక ప్రత్యేక స్థితి కలిగించబడెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఖైబర్ యుద్ధము రోజున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి హ్రజత్ బిషర్ విషము కలిపిన మేక మాంసము తినిరి. దానిని ఒక యూద స్త్రీ ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు కానుకగా పంపించెను. హ్రజత్ బిషర్ తన ఒక్క బుక్క మింగిన తర్వాత అక్కడి నుండి కదలక ముందే వారి రంగు మారి తిల్సాన్ వలె నల్లగా మారెను. నొప్పితో ఒక సంవత్సరము వరకు వారి స్థితి బాధాకరంగా వుండెను. ఒకరు సహకరించనిదే వారు శరీరము త్రిప్పుకొలేక పోయేవారు. ఇదే స్థితిలో వారు మృతి చెందిరి. వారు తమ స్థలము నుండి కదలకముందే తిన్న రత్వాత కొద్ది సేపటిలోనే మృతి చెందిరని కూడ అంటారు. హ్రజత్ బిషర్ బిన్ బరా మృతి చెందినప్పుడు వారి తల్లికి తీవ్ర బాధ కలిగెను. వారు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్తా! బిషర్ మరణము బనూ సల్మా ప్రాణము తీసుకొనును. మృతులు ఒకరినొకరు గుర్తు పట్టుదురా? బిషర్‌కు సలాం పంపవచ్చునా? రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ బిషర్ తల్లి! నా ప్రాణమున్న ఉనికి ప్రమాణముగా! పక్షులు పరస్పరం వృక్షములపై గుర్తు పట్టినల్లే స్వర్గములో ఒకరు మరొకరిని గుర్తు పట్టగలరు. మరో కథనములో ఇట్లు కూడ గలదు. బనూ సల్మాలోని ఏవరైనా ఒక వ్యక్తి మరణమునకు చేరువైనప్పుడు హ్రజత్ బిషర్ తల్లి అతని వద్దకు వెళ్లి ఓ ఫలానా! నీకు సలాం అనేవారు. బదులుగా అతడు నీపై సలాం అనేవాడు. అనంతరం బిషర్‌కు నా సలం తెలుపమని ఆమె అనేవారు.

మరో కథనము ప్రకారము హ్రజత్ బిషర్ సోదరి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందే ముందు అనారోగ్యానికి గురైనప్పుడు వారి వద్దకు వచ్చినప్పుడు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీ సోదరుని వెంట ఖైబర్‌లో నేను తిన్న బుక్క వలన నా నరాలు తెగుతున్నట్లు నేను భావిస్తున్నాను.

ఇదే విషము వలన నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందారని కొందరు శత్రులువు విమర్శిస్తారు. చరిత్ర పుస్తకములలో కొందరు ఈ విషయమును చర్చించిరి. కొందరు చరిత్రకారులు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అమరత్వ స్థాయి కల్పించుటకు ఇటువంటి కథనములను స్వీకరించుటకు సిద్ధమైతారు. వాస్తవానికి ఇది సరైన విషయము కాదు. ఈ విషయము గురించి మన రిసర్చ్ సెల్ (పరిశోధన కేంద్రము) కూడ నాకొక వివరణ వ్రాసి పంపినది. చరిత్ర లేదా హదీసు పుస్తకములలో నిరూపితమైన ఒక విషయమేమనగా ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషము వలన మృతి చెందలేదు. ఇలా చెప్తున్నటువంటి వ్యక్తులకు ఈ కథనములన్నిటి గురించి తెలియదు లేక వారు అపోహకు గురైనారు. ఎందుకనగా విషమిచ్చిన సంఘటన ఖైబర్ యుద్ధము సందర్భమున సంభవించెను. దాని తర్వాత నాలుగు సంవత్సరముల వరకు వారు సల్లల్లాహు అలైహి వసల్లం జీవించి వుండిరి. మంచి ఆరోగ్యవంతమైన జీవితము గడిపిరి. గతము మాదిరిగానే యుద్ధములలో పాల్గొనిరి. ప్రార్థనలు, ఇతర పనులలో ఎలాంటి తేడా రాలేదు. నాలుగు సంవత్సరముల తర్వాత జ్వరము, తల నొప్పి రావడం, మృతి చెందడం వలన అదే విషము నాలగు సంవత్సరముల తర్వాత ప్రభావము చూపెనని ఏ వివేకి అనలేదు. ఈ విషయములో భాగంగా ప్రస్తావించబడిన హదీసులో ఒక బాధ కలిగినట్లు ప్రస్తావన మాత్రమే వున్నది. దానినే అప్పుడు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తపరచిరి. ఒక శారీరక బాధ లేక గాయము కొన్ని ప్రత్యేక సందర్భములలో బహిర్గతమగు విషయము అందరికి తెలిసినదే. వివరాల్లోకి వెళ్ళినచో ఖైబర్ సందర్భమున ఇవ్వబడిన విషముతో కూడిన మాంసమును వారు తిని మ్రింగక కేవలం నోట్లో వేసుకొనిరని కథనములు గలవు. ఇదే కారణము వలన వారు మృతి చెందలేదని వారి ఆరోగ్యవంతమైన జీవితము నిరూపించును. హదీసులలో ఈ సంఘటన పూర్తి వివరాలున్నవి. వాటిలో ఇట్లు కూడ వ్రాసి వున్నది. ఇందులో విషమున్నదని వారికి తెలిసిపోయెను. కావున దీనిని తినకూడదని వారు తమ అనుచరులను నిలువరించిరి. విషము కలిపిన మహిళను పిలిపించుకొని

అడిగిరి. ఆమె ఇట్లు సమాధానమిచ్చెను. మేము ఎందుకు విషము కలిపినామనగా మీరు నిజమైన ప్రవక్త అయినచో మీరు క్షేమంగా వుందురు. లేనిచో మేము మీ నుండి విముక్తి పొందదెము. వారు సల్లం సురక్షితంగా వున్నట్లు యూదులు ప్రకటిస్తున్నారు. ఇంత భయంకరమైన విషమున్నను వారు బ్రతికి పోయారని ఆ మహిళ భావించెను. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మహిళను క్షమించిరని, అనంతరం ఆ మహిళ ఇస్లాం స్వీకరించెనని కథనములలో వ్రాసి వున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను ఇద్దరు మృతుల గురించి ప్రస్తావింతును. వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలు జుమా నమాజ్ తర్వాత చదివింతును. ఒకరు గౌ॥ నసీర్ అహ్మద్ గారు. వీరు గౌ॥ అలీ ముహమ్మద్ రాజన్ గారి సుపుత్రులు. 21 నవంబర్ 2019వ తేదీన 63 సం॥ల వయసులో మృతి చెందిరి.انا للہ وانا الیہ راجعون

రెండవ జనాజ అతావుల్ కరీం ముబష్షిర్ గారిది. వీరు మియాం అల్లాహ్ దత్త కిర్తు జిల్లా షేఖుపూర ప్రస్తుతం నివాసం కెనడా గారి కుమారులు. 13 నవంబర్ తేదీన 75 సం॥ల వయసులో వీరు మృతి చెందారు. انا للہ وانا الیہ راجعون۔

హుజూరె అన్వర్ మృతుల క్షమాపణ, స్థాయి అంతస్తులు పెరుగుటకు, వారి సంతానము వారి సత్కార్యములను కొనసాగించాలని దుఆ చేశారు.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |